23.

# ఆనందానికి దైవమే ఆధారము

నిద్దురనుండి లేచి మరి నిద్దుర పోయెడుదాక పొట్టకై
హద్దును పద్దు లేక వ్యయమందగ జేయుచు జీవితంబు నీ
విద్దెల ధారపోసి అరవింద దళాక్షుని విస్మరించి ఏ
పెద్ద సుఖంబు నొందితివొ ప్రీతిగ యోచనచేయు మానవా!

ప్రేమస్వరూపులారా!

మానవుడు ఆనందాన్ని పొందగోరి అనేక విధముల ఈ ప్రపంచమునందు విచారము సలుపుతున్నాడు. ఐతే ఈ ఆనందము వస్తువులయందు ఉన్నదా? లేక ప్రదేశములందున్నదా? లేక వ్యక్తులయందున్నదా? ఎక్కడ ఉంది అనేటువంటి విషయాన్ని గుర్తించుకోలేక పోతున్నారు. ఆనందమన్నది వస్తువులయందు కాని లేక ప్రదేశమునందు కాని, లేక వ్యక్తులయందు కాని కానరాదు. సర్వత్ర ఉండినటువంటి ఆనందమును ఎక్కడని వెతకుటకు వీలవుతుంది? భగవంతుడు, సర్వ జీవులయందు, సర్వ ప్రాణులయందు, సర్వ ప్రదేశములందు, సర్వ విషయములయందు లీనమై ఉన్నాడు. దీనిని భగవద్గీతయందు చక్కగా విచారణ సలిపి, ఐన్‌స్టీన్ దీనికొక క్రొత్త పేరు పెట్టాడు. 'సైకోట్రోనిక్' అన్నాడు. అనగా సర్వత్రా ఉండేటువంటి భగవంతుడిని ఏమని పిలిచేది? కనుక ఇతను ఒక విధమైనటువంటియొక్క అజ్ఞాతరూపంతో కనిపిస్తున్నాడు. భగవంతుడు అజ్ఞాత శక్తి స్వరూపుడై సర్వ వ్యక్తులయందు, సర్వ ప్రదేశములయందు సర్వ పదార్థములయందు గోచరించక మెలుగుచున్నాడు. కాని మానవాకారమును ధరించినటువంటి వ్యక్తి దైవమునుకూడా ఒక ఆకారముగా భావించి సర్వత్రా విచారణ సలుపుచున్నాడు. ఆనందమన్నది కాని ఆనందమునకు రూపము లేదు. ప్రేమ ఉన్నది కాని, ప్రేమకు ఒక స్వరూపము లేదు. ఐతే స్వరూపము లేనటువంటి ప్రేమను ఏ రీతిగా మనం విశ్వసిస్తున్నాము. ఆకారములేని ఆనందాన్ని మనము ఎట్లు అనుభవిస్తున్నాము? ప్రేమకు

sri sathyasai vachanamrutam

రూపము లేదు కాని, ప్రేమను అందించేటువంటి వ్యక్తికి రూపము ఉంది. ఒక పుష్పము ఉన్నది, కాని ఆ పుష్పము యొక్క ఆకారము మనకు కనిపించదు. కాని వాసన మాత్రము అనుభూతికి వస్తుంటాది. వాసన మాత్రము అనుభవిస్తున్నాము కాని, ఈ వాసనకు రూపమేమిటి అని విచారణ చేస్తే, ఈ వాసనకు రూపము పుష్పమే. ప్రాచీనకాలమునుండి మహర్షులు, యోగులు, సత్పురుషులు, పండితులు వాసనను మాత్రమే గుర్తించి, ఈ వాసనకు ఆకారము ఎక్కడ? అని ప్రపంచమంతా విచారణ సలుపుతూ వచ్చారు. కాని మహర్షులు సర్వసంగ పరిత్యాగులైపోయి, సర్వమూ త్యాగము గావించి వాసనయొక్క రూపము ఎక్కడ ఉందనేటువంటి విషయంలో గట్టిగా పట్టుబట్టి వెతకటానికి ప్రారంభించారు. అన్ని పొదలను కూడ శోధించారు, అన్ని అడవులను శోధించారు. కాని ఎక్కడా పుష్పము కనిపించలేదు. కాని కొంతమంది ఏదో వాసన వస్తుండాది. వాసనే చాలని, వాసనతోనే కొంతవరకు సంతృప్తిపడి పుష్పముయొక్క విచారణ చేయడం, కొంత కాలము విరమించుకున్నారు.

**పట్టినదేదియో పట్టనే పట్టితి**
**పట్టునెగ్గెడుదాక అట్టెయుండు**
**కోరినదేదియో కోరనే కోరితి**
**కోర్కె చెల్లెడుదాక కొలచియుండు**
**అడిగినదేదియో అడగనే అడిగితి**
**వడిగినదిడుదాక విడువకుండు**
**తలచినదేదియో తలచనే తలచితి**
**తలపు తీరెడుదాక తరలకుండు**
**పోరు పడలేక తానైన బ్రోవవలయు**
**ఒడలు తెలియక నీవైన ఉడుగవలయు**
**అంతియేగాని మధ్యలో ఆపివేసి**
**తిరిగి పోవుట భక్తుని దీక్షకాదు.**

sri sathyasaivachanamrutam

ఈ పట్టుదల చేత తాము వెతికి ఆ పుష్పాన్ని గుర్తించారు. ఆ పుష్పమునుండియే ఆనందము అనేటువంటి సుగందము ఆవిర్భవిస్తూ వచ్చింది. మేము తెలుసుకున్నాము. ఈ పుష్పము ఎక్కడున్నది మేము గుర్తించాము అని పండితులు వర్ణించారు. కొంతమంది పండితులు, మహర్షులు, యోగులు పడిశం వల్ల ఆ వాసనను కూడా అనుభవించ లేకపోయారు. అట్టి వాసనను కూడను గుర్తించలేనటువంటి వారే నాస్తికులు వారికి ముక్కు ఉన్నది కాని, పడిశం పట్టింది. అందువల్ల వాసనను కూడను గుర్తించలేనటువంటి హీనులుగా మారిపోయారు. ఆ గుర్తించుకున్నటివంటి వ్యక్తులే 'వేదాహమేతం పురుషం మహాంతం, ఆదిత్య వర్ణం తమసఃపరస్తాత్' ఎక్కడ చూచినా ఉండినటువంటి భగవంతుని మనం ఏ రీతిగా గుర్తించాలి. ఎట్టి వ్యక్తియందు కూడను హృదయమనే పుష్పమునుండి ఆనందమనేటువంటి సుగంధము వెలువడుతున్నది. ఈ హృదయము పరిపూర్ణమైనటువంటిది. అదియూ పూర్ణము, ఇదియూ పూర్ణము. పూర్ణముననుదయించు పూర్ణము, పూర్ణమున పూర్ణంబు తీసిన పూర్ణమే శేషించియుండును దీనినే.

**పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణముదచ్యతే**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే.**

అని వేదం బోధించింది. కనుక పూర్ణత్వమనేటువంటి తత్త్వము ఏ విధంగా ఒక కిలో బెల్లం తీసుకొని వచ్చావు. ఆ బెల్లమును కొంచెం తుంచుకొని నాలుకపైన వేసుకున్నావు. అది తియ్యగా ఉన్నది. ఇంకొంచెం ముక్క తీసుకొని పోయి కాఫీలో వేసావు. కాని కాఫీ కూడను తియ్యగా ఉన్నది. ఇంకొంచెం బెల్లమును తీసుకొని దాన్ని పానకంలో వేసావు. నీళ్ళలో వేసావు ఆ నీరు కూడా తియ్యగా ఉన్నది. మూడు ముక్కలుగా తుంచినావు, నీవు. కాని మూడు ముక్కలలోపల కూడను తీపే ఉంటున్నాది. ఆ ముక్కను తుంచిన తర్వాత, ఆ ముక్కలో ఉండిన శేషము కూడను తియ్యగా ఉంటున్నది. కాని ముక్కలు పరిమాణము వేరు కాని అన్ని ముక్కలయందు కూడను తియ్యదనముగానే రుచిస్తున్నాది. కనుకనే అదియు పూర్ణము, ఇదియూ పూర్ణము. అది తీపి, ఇది తీపి. పూర్ణమున ఉదయించు పూర్ణము, ఆ తీపినుండి తీపే ఆవిర్భవిస్తుంది. పూర్ణమును పూర్ణము తీసిన పూర్ణమే మిగిలియుండు. మిగిలినటువంటిదీ బెల్లమె. పానకంలో వేసినటువంచిది బెల్లమే. కాఫీలో బెల్లమే. అనగా

పూర్ణమనగా బెల్లం పూర్ణమని కాదు, దీని మాధుర్యమే పూర్ణము.

**ప్రతి పనీ పరిపూర్ణంగా చేయాలి**

ఇటలీలో ఒక శిల్పి పని చేసేటువంటి వ్యక్తి, ఆంథోని అనేటువంటివాడు ఉండేవాడు. ఇతను వయోలిన్ తయారు చేయడంలో సుప్రసిద్ధుడు. ఒక్క వయోలిన్‌ను సంవత్సరమంతా కష్టపడి చేస్తూ వచ్చాడు. ఈ ఆంథోని ఫ్రెండు ఒకడు వచ్చి 'ఏమోయ్ ఆంథోని, నీవు ఒక్క వయోలిన్ చేయడానికి ఒక్క సంవత్సరమంతా తీసుకుంటే నీ ఆలుబిడ్డలు బ్రతికేటువంటి మార్గమేమిటి'. ఓ స్నేహితుడా! భగవంతుడు పూర్ణస్వరూపుడు. మనం ఏ పని చేసినప్పటికి కూడను పూర్ణంగా ఉంటుండాలి. ఏదో నా స్వార్థము నిమిత్తమై ఆలుబిడ్డలను పోషించుకునే నిమిత్తమై ఆ పూర్ణత్వములో ఏమాత్రం కూడను దోషము కలుగ కూడదు. కనుక భగవంతుడు పూర్ణుడు కాబట్టి అతనికి పూర్ణత్వంగా మనము పనిచేయాలి. అప్పుడే భగవంతుడు పూర్ణ ఆనందాన్ని అందించగలడు, అని ఆ స్నేహితునికి బోధించాడు. అనగా మనము ఏ చిన్న పని చేసినప్పటికిని ఆ చిన్న పని కూడను పరిపూర్ణమైనటువంటి స్థితి పొందేటువంటి రీతిగా మనము చేయాలి. కారణము భగవంతుడు పూర్ణ స్వరూపుడు. మన పనులన్ని కూడను పూర్ణంగానే ఉంటుండాలి. మనము భగవంతునియొక్క అంశము కాబట్టి అంశమైనటువంటి వ్యక్తి కూడను పరిపూర్ణమైనటువంటి తత్వాన్ని పొందాలి అని. అందువలననే ఆ వయోలిన్‌లు చాలా ప్రసిద్ధి గాంచినాయి ఈనాడు కూడను ఆంథోనీ వయోలిన్స్ ప్రసిద్ధి. ఈ విధముగా భగవంతునియొక్క పూర్ణాన్ని నిరూపించు నిమిత్తమై పనులయందు కూడను పూర్ణత్వాన్ని మనము ఆచరించాలి. పూర్ణత్వము ఒక్కటే కాని అనేకం కాదు. మనము ఏకత్వంలో అనేకత్వంగా విభజిస్తున్నాము కాని తిరిగి అనేకత్వమును తిరిగి ఏకత్వంగా మార్చాలి.

**అనేకత్వమును ఏకత్వంగా మార్చాలి**

ఇప్పుడు టైలరు దగ్గర రెండు వస్తువులు ఉన్నాయి ఒకటి కత్తెర ఉంది. ఇంకొకటి సూది ఉంది. ఈ రెండింటిద్వారా ఏమి జరుగుతుంది? మనము తీసుకొని వెళ్ళి రెండు మీటర్ల బట్టను ఇచ్చాము, షర్టు కుట్టమని. ఒకే బట్ట రెండు మీటర్లున్నాది. ఆ టైలరు

sri sathyasaivahini.in watermark

తనయొక్క కొలతలను తీసుకున్నాడు. కత్తెర తీసుకున్నాడు ముక్కలు ముక్కలుగా కత్తిరించాడు. అన్ని కొలతల ప్రకారము చేతులు, కాలరు ఇవంతా సక్రమమైనవిగా కత్తిరించాడు. ఆ రెండు మీటర్సుగా ఉండినటువంటి బట్ట అనేక విధమైనటువంటి ముక్కలుగా మారిపోయినది. ఇంతటితో ఈ టైలరు మానలేదు. తిరిగి వాటన్నిటిని కూడను ఏకం చేసి ఒక షర్టు మాదిరి కుట్లు వేశాడు. ఈ ముక్కలు చేసినటువంటిది ఏమిటి కత్తెర, అన్నింటిని చేర్చి ఒక్క షర్టుగా చేసినటువంటిది ఏమిటి సూది. కనుకనే మనము ఏకత్వమైనటువంటి దైవత్వాన్ని మనము అనేకత్వంగా మారుస్తున్నాము. ఒకరు రామ, ఒకరు కృష్ణ, ఒకరు ఈశ్వర, ఒకరు అల్లా, ఒకరు జీసస్, ఒకరు జోరాష్ట్రియన్. ఈ విధమైనటువంటి ముక్కలుగా మనము చేస్తున్నాము. కాని తిరిగి ప్రేమ అనేటువంటి భక్తి అన్నింటిని ఒక్క రూపంగా మారుస్తూ వచ్చింది. All are one my dear son, be alike to every one. ఇది జీసస్ చెప్పాడు. All are one my dear son, be alike to every one అనగా తను అనేక విధములైనటువంటి విషయములు బోధించే సమయములో, అందరు చాలా భాదపడుతూ వచ్చారు. ఈ ప్రీస్ట్‌ను, హెడ్ ప్రీస్ట్‌ను చాలా నిందిస్తూ వచ్చారు. ఈ అదేశములు వేసినటువంటి గవర్నరును కూడా నిందిస్తూ వచ్చారు. అట్టి నిందలు మనకు పనికి రావు అనే ఉద్దేశముతో ఏకత్వాన్ని బోధించేటువంటి ఉద్దేశముతో All are one my dear son, be alike to every one అని చెప్పాడు. ఎవ్వరినీ మనము నిందించకూడదు, ఎవ్వరిని మనము దూషించకూడదు, ఎవ్వరిని మనం విమర్శించకూడదు. కనుకనే ప్రేమ అని తత్త్వమే ఎవ్వరినిదూషించదు, తిరస్కరించదు.

**లౌకిక ప్రేమ - దైవ ప్రేమ**

ఐతే లౌకికమైన ప్రేమకు, ఆధ్యాత్మిక ప్రేమకు చాలా వ్యత్యాసముంటుంది. ఆధ్యాత్మిక ప్రేమయే దైవ ప్రేమ. దైవప్రేమ ఎట్టి ఫలితాన్ని కూడా ఆశించదు. ఎట్టి దూషణ, భూషణ, తిరస్కారములు కూడను లెక్క చేయదు. ప్రేమ ఎప్పుడు ఆశ లేకుండా ప్రేమనే అందిస్తుంది. స్వార్థమన్నది ఈ ప్రేమకు ఏమాత్రం కనిపించదు. ఇట్టి స్వార్థరహితమైనటువంటి ప్రేమనే భగవంతుని ప్రేమ. భగవంతుని ప్రేమ నిరంతరము ఇచ్చుకునేదే కాని తిరిగి పుచ్చుకునేది కాదు. కాని లౌకికమైన ప్రాపంచిక

sri sathyasai vachanamrutam

సంబంధమైనటువంటి ప్రేమ, పుచ్చుకునేదే కాని ఇచ్చుకునేదే కాదు. లౌకికమైన ప్రేమ ప్రతిఫలాన్ని ఆశిస్తుంది. స్వార్థ సంతోషాన్ని అందిస్తుంది, ప్రేమ మరొక విధమైనటువంటి ఫలితాన్ని కోరుతుంది. కాని భగవంతుని ప్రేమ మరొకటి ఆశించదు. ప్రేమకు ప్రేమనే సాటి. అంతే కాని ప్రేమకు మరొక వస్తువు సాటి రాదు. కనుక ఇట్లాంటి సాటిరానటువంటి ప్రేమ తత్త్వము దైవము ప్రేమ. ఇక లౌకికమైన ప్రేమ ఏ విధంగా ఉంటుంది? మీకందరికిని తెలుసును. ఒక బాలునికి వివాహము జరిగింది. వివాహము జరిగిన తరువాత మూడవ దినము ఏదో ఒక పార్కులో నడుస్తూ వచ్చారు. కాని ఈ యువకుడు పార్కులోపల ఒక ముళ్ళను చూచాడు. ముళ్ళను చూచేటప్పటికి భార్య ఆ ముళ్ళపై కాలుపెడుతుందేమో? భార్యకు ఏమైనా ప్రమాదము జరుగుతుందో ఏమో? అనేటువంటి ప్రేమచేత, భార్యను రెక్క పట్టుకొని ముళ్ళు, ముళ్ళు, ముళ్ళు అని వెనక్కు లాగాడు. కాని అప్పుడు భార్య అతనికి లైఫ్‌గా మారింది. కనుకనే అతను ఆత్రుతతో ఆమెను వెనుకకు లాగాడు. కాని ఇదే ప్రేమ, ఇదే దంపతులు, ఒక ఆరు నెలలు జరిగింతర్వాత, మరొక పార్కులో నడుస్తున్నారు. తిరిగి అక్కడ ఒక ముళ్ళు ఈ భర్తకంటికే కనిపించింది. అప్పుడు ఈ ఆత్రుత కొంచెం తగ్గిపోయింది. ముళ్ళు ఉంది చూచుకొని నడువు అన్నాడు. ఇంకొక సంవత్సరం అయిన తరువాత తిరిగి అదే పార్కుకు పోయినపుడు ముళ్ళు కనిపించింది. కాని ఈ ప్రేమ తగ్గిపోయింది. 'కళ్ళు కనిపించ లేదా ముళ్ళుంది వెనక్కి రా!' అన్నాడు. ఇది లౌకికమైన ప్రేమ సంవత్సరాలు జరిగే కొలది క్రమక్రమేణా తరుగుతూ పోతుంది. భగవంతుని ప్రేమ కేవలం సంవత్సరములే కాదు, యుగములే కాదు, జన్మలెన్ని మారినప్పటికిని ప్రేమ ప్రేమగానే ఉంటుంది. ఇది శాశ్వతమైన ప్రేమ ఇది మధురమైన ప్రేమ, అతని వాక్కులు మధురం, అతని పనులు మధురము, అతని సర్వమూ మధురమే. కనుకనే ఆనాటి గోపికలు మధురాధిపతే రఖిలం మధురం, మధురం అన్నారు. ఆ కృష్ణ వియోగము భరించుకోలేక పోయారు. బృందావనమంతయూ సంచరించారు. ఎక్కడ ఉన్నాడు కృష్ణుడు అని విచారం చేశారు. ఏ పుష్పమును చూచినప్పటికిని, ఓ పుష్పమా! నా గోపాలుని చూచితివా? అని ప్రశ్నించేటువంటివారు. పుష్పమెక్కడైనా కృష్ణున్ని చూస్తుందా అనేటువంటి విచారమే లేదు. అనగా ఏమిటి? సర్వత్రా ఉండేటువంటి భగవంతున్ని పువ్వులూ చూస్తాయి,

మొక్కలు చూస్తాయి, కొమ్మలు చూస్తాయి, రెమ్మలు చూస్తాయి. కాని అందరియందు ఉండినవాడు భగవంతుడే. కాబట్టి అన్ని రూపములు కూడను చూడవచ్చును పుష్పములు కాని మా కృష్ణుని యొక్క చిహ్నములు వేరు వేరుగా ఉంటున్నాయి.

**నల్లనివాడు పద్మనయనంబులవాడు కృపారసంబు పై**
**జల్లెడువాడు మౌళిపరిసర్పిత పింఛమువాడు నవ్వురా**
**జిల్లెడు మోమువాడొకడు చెల్వల మానధనంబు దోచెనో**
**మల్లియలార! మీ పొదల మాటున లేడుగదమ్మ చెప్పరే!**

అనగా ఆనాటి గోపికలు సర్వత్రా భగవంతుడే, సర్వ పదార్థములయందు కూడా భగవంతుడే. ఆంధోని చెప్పినట్టుగా పూర్ణస్వరూపుడు భగవంతుడు. కనుక భగవంతుడు పూర్ణస్వరూపుడు ఏ పదార్థమునందు లేడు? ఏ పదార్థమునందు ఉన్నాడు? అని నిర్ణయించే అధికారము ఎవ్వరికి లేదు. అందరియందు వున్నాడు. కనుక అందరిని మనము గౌరవించాల్సిందే. అందరిని మనము విశ్వసించవలసిందే. అందరిని ప్రేమించవలసిందే. ఈ ప్రేమతత్త్వమనేటువంటిది కేవలము ఒక పదార్థము యొక్క ఫలితము ఆశించి కాదు. మన ప్రేమ ఈ జగత్తునందు ఏదో ఒక ఫలితము పొందే నిమిత్తంగా మనం ప్రేమించకూడదు. ప్రేమ నిమిత్తమై ప్రేమించాలి.

**జ్యోతితో కృష్ణ దర్శనం పొందిన సుగుణ**

ఇదే విధముగనే ఆ గొల్లపల్లెకు కొత్త కోడలు వచ్చింది. ఆనాటి గొల్లపల్లెయొక్క యువతులందరు కూడను సాయంకాలము అయ్యేటప్పటికి యశోద ఇంటి ముందు పెట్టినటువంటి దీపమును ముట్టించుకొని రావటం ఆనాటి సాంప్రదాయం. అనగా వారు శ్రీమంతులు, అంతే కాకుండా ఆ శ్రీమంతుని యింట శ్రీ స్వరూపుడు పుట్టాడు. అష్టైశ్వర్య స్వరూపుడునైనటువంటి కృష్ణుడు పుట్టాడు. అటువంటి వారింట జ్యోతి మన ఇంటికి అంటించుకొని వస్తే మన ఇంటిలో కూడను అష్టైశ్వర్యములు అభివృద్ధి అవుతాయి అని వారి ఆశ. ఆ ఇంటినుంచి దీపమును అంటింటుకొని వచ్చేవారు. కాని ఈ కొత్త కోడలుయొక్క

sri sathyasai vachanamrutam

అత్తమామలు కాని, భర్త కాని, దీనిని అంగీకరించలేదు. గోపికలందరు ఆ కృష్ణుని వెంటపడుతున్నారు. నా కోడలు కూడా సంసారము వదిలి ఏ విధముగా చెడిపోతుందో ఏమో అనే భయముచేత ఈ కోడలును పంపకుండా, అత్త వచ్చి ఆ జ్యోతిని అంటించుకొని పోయేటువంటిది. కాని పడుచుకు కృష్ణునియొక్క రూపము చూడాలి. అందరు వర్ణిస్తున్నారు. ఆ యశోద ఇంటిలోపల కృష్ణుడు తిరిగాడుచుంటే అందరు చూచినవారున్నారు. నా ప్రాప్తము ఏమిటో, నా దురదృష్టమేమిటో అని భాదపడుతూ ఉండేది. నిరంతరము కూడను అష్టాంగములయొక్క అష్ట శక్తులను వర్ణించుకుంటూ ఉండేది. శబ్ద బ్రహ్మమయి, చరాచరమయి, జ్యోతిర్మయి, వాగ్మయి, నిత్యానందమయి, పరాపరమయి, మాయామయి, శ్రీమయి అని వర్ణిస్తుండేది పాపము. అది కూడను శబ్దము పైకి రాకుండా తనలో తాను వర్ణించుకుంటూ ఉండేది. అత్తమామలు వింటారేమో అని ఆమె భయం. కాని ఒకనాడు ఈమె ప్రార్థనను అంగీకరించినటువంటి కృష్ణుడు, ఆమెకు అదృష్టాన్ని అందించే నిమిత్తమై అత్తకు జ్వరం వచ్చింది. కదలలేక, మెదలలేక ఆ కోడలుకు చెప్పింది. 'అమ్మా! ఈ పొద్దు ఒక్క దినము మాత్రమే నీవు పోయి ఆ జ్యోతిని అంటించుకొని రా!' అనింది. ఆ పలుకును విని ఆనందించి, యశోద ఇంటికి దీపము తీసుకొని పరుగెత్తికొని పోయింది కోడలు. వరండాలో ఒక గూటిలోపల ప్రతి దినం ఆ జ్యోతి పెడుతుండేంది,యశోద. లోపలికి పోవడానికి వీలులేదు. అప్పుడు బయటనే ఆ జ్యోతిని అంటించుకుంటూ, అయ్యో! కృష్ణుడు ఉండినటువంటి స్థానమే యశోద ఇల్లు అని కృష్ణ చింతనచేత తనయొక్క దేహాన్ని తాను మరచింది. జ్యోతి వెలిగింది, కాని చేయికూడా కాలుతూ వచ్చింది, బట్ట కాలుతూ వచ్చింది. బట్ట కాలిన వాసన వచ్చినప్పటికి యశోద లోపలనుండి పరుగెత్తుకు వచ్చింది, చూచింది ఈ దృశ్యాన్ని 'ఏమిటమ్మా నీకు పిచ్చి పట్టిందా? నీకు రాత్రి నిద్ర లేదా, ఈ అగ్ని కాలిపోతున్నా చలనం లేదు' అని ప్రశ్నించేటప్పటికినీ, ఆ వనిత నవ్వుతూ ఆనందంగా ఉన్నాది. దీపమును అంటించుకోడానికి గోపికలందరూ వచ్చారు. ఎందుకోసం నవ్వుతున్నాది. ఆ జ్యోతి లోపలనే కృష్ణుడు కనిపిస్తున్నాడు. ఆ కృష్ణున్ని దర్శిస్తూ తన దేహాన్ని తాను మరచిపోయింది. ఈ అమ్మాయి పేరు సుగుణ. ఈ వార్త విన్నారు. గోపికలందరు కూడను బజారు వెంట

srisathyasaivachanamrutam

నృత్యం చేస్తూ,

**సుగుణకు కనిపించెనంట,**
**మన సుగుణకు కనిపించేనంట**
**నందుని ఇంట గోపాలుడంట,**
**దీపాన కనిపించెనంట,**
**అదే వేడికి తగిలిన మంట**
**సుగుణకు కనిపించెనంట,**
**మన సుగుణకు కనిపించేనంట**

ఈ విధంగా పాటలు పాడుకుంటూ పరుగెత్తుతున్నారు. లోపల పండుకున్నటువంటి అత్తగారు కూడను ఈ మాటలు విన్నారు. ఈ వార్త విన్న అత్తగారు, నాకు జ్వరం రావడంచేత దురదృష్టవశాత్తు నీవు ఆయన కొంపకు పోవలసి వచ్చింది. అక్కడికి పోయి కృష్ణున్ని చూచితివా! అని కోపంతో యింటికి చేరిన కోడలును కఱ్ఱ తీసుకొని బాగా కొట్టింది. అత్తగారు కొట్టినా, తిట్టినా ఏమి చేసినప్పటికిని ఆనందంగా వున్నాది. దీనినే గోపికలంతా విని మరల వర్ణిస్తూ వచ్చారు.

**అత్తలు మొత్తుకున్న మరి భర్తలు కత్తులు నూరుచున్న**
**నోరెత్తరు, కోపగించరు, ఎటకేగరు, భీతిలబోరు గోపికల్**
**పొత్తములందు చిత్తరువురీతిగనుండెను కృష్ణుడు వారిలో!**

ఒక కాగితముపైన ప్రింటు చేసిన తరువాత ఆ ప్రింటును ఏ విధముగా వేరు చేయడం వీలుకాదో, అదే రీతిగా ఆమె హృదయంలోపల కృష్ణుడు చిత్తరువుగా వున్నాడు. ఇది ఎవ్వరికిని వేరు చేయడం వీలుకాదు. ఈ విధంగా గోపకలందరు ఆనందించారు. అనగా 'యద్భావం తద్భవతి'. కనుక ప్రతి మానవుని అనుభూతులు అనేక రకములుగా ఉంటుంటాయి. కాని సర్వులయందు మాత్రము భగవంతుడు ఉంటున్నాడు. ఏదో అంతో ఇంతో కాదు పూర్ణస్వరూపుడై ఉంటాడు. ఎట్లా పెద్ద సముద్రము, సముద్రానికి ఒక చిన్న పాత్ర తీసుకొని పోయి నింపుకుంటే, చిన్న పాత్రకు నిండుకొని వస్తుంది నీరు, పెద్ద పాత్రను

sri sathyasai vachanamrutam

తీసుకొని పోతే పెద్ద పాత్రకు నిండుకుంటాది నీరు. సముద్రములోని నీరు నాలుకపై వేసిన ఉప్పే, చిన్నపాత్రలో ఉన్నటువంటి నీరు తీసుకొని నాలుకపై వేసిన ఉప్పే, పెద్దపాత్రలో ఉన్నటువంటి నీరు తీసుకొని నాలుకపై వేసినా ఉప్పే.

**పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణముదచ్యతే**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే.**

పరిమాణము ఎక్కువగా, తక్కువగా ఉంటుండాది. కాని, దాని రుచి అన్నింటియందు ఒక్కటే. ప్రతి వ్యక్తియందు కూడను అంతో యింతో ప్రేమ లేకుండా ఉండదు. ఆ ప్రేమనే భగవంతునియొక్క స్వరూపము. అదియే పూర్ణత్వము. అది పూర్ణమదః పూర్ణమిదం. కనుక ప్రతి జీవియందు కూడను. ప్రతి ప్రాణియందు కూడను ఈ ప్రేమతత్త్వం లేకుండా పోలేదు.

**అన్ని ప్రాణులకూ వ్యామోహం సమానమే**

ఒకానొక యుద్ధ సమయమునందు పాండవులకు, కౌరవులకు సంధి చేయాలని, ఎవ్వరి ప్రాణములు పోకుండా రక్షించాలని ఆలోచించి వ్యాసుడు రథంలో వస్తున్నాడు. వ్యాసుడు అనంత పురాణములను కూడను వ్రాసాడు. వేదములు నాలుగు మాత్రమే కాదు. 'అనంతో వై వేదః'. ఇన్ని వేదములు కూడా అన్నింటిని చదివి గుర్తించ లేకపోతున్నారని దానిని నాలుగు విధములుగా విభజించారు. ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వణవేదము. ఈ వ్యాసుల వారికి అన్ని క్రిమికీటకాదులయొక్క భాషకూడను తెలుసును. అతని రథము వస్తున్నప్పుడు ఒక చిన్న పురుగు చాలా వేగంగా పరుగెత్తుకు వస్తున్నాది, రోడ్డుపైన. దానిని చూచాడు, రథము ఆపాడు. 'ఓ క్రిమి! ఎందుకు నీవింత వేగముగా పోతున్నావు' అడిగాడు, వ్యాసుడు. అప్పుడు ఆ క్రిమి చెప్పిందంట 'మహర్షి కొన్ని నిమిషాలలోపల అర్జునియొక్క రథము చాలా వేగంగా వస్తుంది. శరవేగంగా వస్తుంది. కాని ఆ రథము వచ్చే లోపల నేను ఇంటికి పోయి చేరాలి. ఎందుకంటే నా భార్యబిడ్డలంతా నాకోసం కాచుకొని ఉంటారు. నేను సుక్షేమంగా ఇంటికి పోయి చేరాలి' అన్నది. అప్పుడు వ్యాసుడు అనుకున్నాడు. కేవలం మానవులకు మాత్రమే కాదు ఈ భార్యబిడ్డల వ్యామోహము. క్రిమికీటకాదులకు కూడా ఉన్నాది, ఈ వ్యామోహం. కనుకనే కేవలము

srisathyasaivachanamrutam

మానవులుగా ఉంటున్నటువంటి మాత్రమున మానవుడు గొప్ప ఉత్తముడని చెప్పుటకు వీలుకాదు. 'జంతూనాం నరజన్మ దుర్లభం' అన్నారు. కాని వాటి భాష మనకు తెలియదు కాని అన్నింటికి ఈ క్రిమికీటకాదులను కూడను వ్యామోహం ఉంది. అప్పుడే ఈ వ్యాసుడు కూడను 'సర్వతఃపాణిపాదం తత్సర్వతోక్షి శిరోముఖమ్, సర్వతః శృతిమల్లోకే సర్వమావృత్య తిష్టతి' అని వ్యాసుడు అన్నాడు. అన్నింటియందు పాదములచేత, హస్తములచేత, తెలివితేటలచేత, నేత్రములచేత అన్నీ అనుభవిస్తూనే ఉంటున్నాయి, భగవంతుని. కనుక ఈ దివ్యత్వము లేని ప్రదేశము లేదు. సర్వత్రా దివ్యత్వం ఉంది. కాని భగవంతునియొక్క దివ్యత్వము ప్రతిఫలాన్ని ఆశించనటువంటిది. అపేక్షించనటువంటిది భగవంతునియొక్క ప్రేమ. ప్రతిఫలాన్ని ఆశించేటువంటిది లౌకిక ప్రేమ. ఇది అలౌకికము, అది లౌకికము. కాని మనము ఈనాడు లౌకికమును అలౌకికముగా మార్చాలి.

**అన్నింటికి భగవంతుడే అధికారి**

ఒక చక్రవర్తి చాలా గొప్ప ప్రదర్శనశాల పెట్టాడు. ఆ ప్రదర్శనలోపల ఎవరికి ఏది రుచో దానిని తీసుకొని పోవచ్చు అన్నారు. ఆ ప్రదర్శన ఏమిటి? అనేక రకములైనటువంటి క్రిమికీటకాదులు మొదలుకొని మానవునకు అతీతమైనటువంటి శక్తివరకు ఆ ప్రదర్శనలో ఉండొచ్చు. అదియే ఈ ప్రపంచము. సమస్త ప్రాణులతో కూడినటువంటిది. సమస్త వస్తువులతో కూడినటువంటిది. ఆ ప్రదర్శనలోపల సమస్త ప్రజలు వచ్చి సందర్శిస్తున్నారు. కాని ఎవరికి కావలసినది వారు తీసుకొని పోతున్నారు. ధన కనకాది వస్తువులు కూడను తీసుకొని పోతున్నారు. అన్నింటికి వివరణ యిస్తున్నారు. ఈ ప్రదర్శనకు ఒక స్త్రీ ప్రవేశించింది, అన్నియును చూచింది.

**చిత్రంబులు త్రైలోక్యప**
**విత్రంబులు భవలతాల విత్రంబులు స**
**న్మిత్రంబులు ముని జన వన**
**చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్.**

ఇదంతా కూడా భగవంతునియొక్క లీలామానుష విగ్రహంబు, ఇదంతా కూడ లీలామానుష

sri sathyasai vahini amrutam

సంబంధము, ఇదంతా కూడా భగవంతుని చిత్రంబులే అన్నింటికి భగవంతుడే అధికారి. అంతా చూచి ఆమె పోతున్నాది. అనగా దేహాన్ని వదిలే సమయమున తాను ఏదీ తీసుకొని పోలేదు. ఎందుకివన్ని వచ్చే సమయములో మనం ఇంత బట్టైనా తీసుకొని రాము, పోయే సమయములో మన బంధువులకు కాని, తల్లితండ్రులకు కాని అడ్రసు ఇచ్చి పోము. ఎట్లా వచ్చామో, అట్లే పోతున్నాము. అని పోతూ ఉన్నాది. భగవంతుడు, రాజు ఈ ప్రదర్శనకంతా అధికారి. 'ఏమిటమ్మా ఒట్టి చేతులతో పోతున్నావే?' అన్నాడు. 'ఒట్టి చేతులతో వచ్చాను, ఒట్టి చేతులతో పోతున్నాను. ఇది నా సహజం' అన్నది. 'లేదు లేదు దీనినుంచి ఏదైనా ఒకటి తీసుకొని పోవాలి' అని చెప్పాడు.

**భగవంతుని కోరుకుంటే అంతా తనదే అవుతుంది**

రాజులకే రాజు మహారాజు, అతను రాజులకంటె రాజు భగవంతుడు. అతను అడిగాడు ఏదైనా ఒకటి తీసుకొని పో! అన్నాడు. ఐతే నేను అడిగింది ఇవ్వగలరా మీరు? తప్పక ఈ సృష్టి అనే ప్రదర్శనలోపల దేనిని కోరిన కాని దాని విలువనే నేను కట్టను, నేను తప్పక యిస్తాను, అన్నాడు రాజు. రాజా! నీవొక్కడవు నాకు కావాలి, నీవుంటే ఈ సర్వము నాకుండినట్లే, ఈ ప్రపంచములో చిన్న చిన్న వస్తువులంతా నేను కోరి ప్రయోజనమేమిటి? అన్నింటికి సృష్టికర్త అయినటువంటి వాడవు నీవే. అన్నింటికి లయకర్త అయినటువంటి వాడవు నీవే. అన్నింటికి పోషణకర్త అయినటువంటి వాడవు నీవే. నిన్ను తీసుకుంటే ఈ ప్రదర్శనంతా నాదై పోతుంది. అప్పుడు భగవంతుడు తనను తానే ఇచ్చుకున్నాడు. అప్పుడే ఆ స్త్రీ చెప్పింది, పుట్టినందుకు ఇదియే సార్థకము. ఎన్ని అనుభవించినా, ఇక్కడ

**యాచింతా భువి పుత్ర మిత్ర భరణ వ్యాపార సంభాషణే**
**యాచింతా ధన ధాన్య భోగ యశసాం లాభే సదా జాయతే**
**సాచింతా యది నందనందన పద ద్వంద్వారవిందేక్షణే**
**కాచింతా యమరాజ భీమ సదన ద్వార ప్రయాణే ప్రభో.**

భయంకరమైన యమరాజ సదనముంటుంది. చూడు ఒక దట్టమైన తలుపులు వేసుంటాయి. కనుక అతని యొక్క తలుపులు తెరచుకొని పోవలెనంటే భగవత్ చింతన

sri sathyasai vachanamrutam

ఉంటే చాలు. యాచింతా భువి నందనందన పదద్వంద్వార విందేక్షణే. ఆ రెండు పదములుయొక్క చింతన ఒక్క క్షణము చేస్తే చాలు. కాబట్టి భగవంతుడు నాకు చిక్కాడు. వచ్చినందుకు దీన్ని సాధించాను అని ఆ స్త్రీ ఆనందించినది. స్త్రీ అనగా ఎవరు? ప్రకృతియే. అదియే స్త్రీ. కాబట్టి ప్రతి ఒక్కరు కూడను ఈ ఆకారము ధరించినటువంటివారు కాబట్టి అందరు కూడను స్త్రీలే. ప్యాంటు, షర్టు వేసుకొన్నంత మాత్రమున పురుషుడు, చీర కట్టుకున్నంత మాత్రమున స్త్రీలు అని చెప్పడానికి వీలు లేదు.

## ప్రతి వ్యక్తీ అర్ధనారీశ్వరుడే

'ఇచ్ఛా రామో భవతి, స్తబ్ధో భవతి, మత్తో భవతి, ఆత్మా రామో భవతి'. అనగా పుమాన్, పుమాన్. అనగా పురము దేహము. దేహమును ధరించినటువంటి వారు కూడను స్త్రీలే. ఈ దేహమును నఖశిఖ పర్యంతము సంచరించేటువంటి శక్తే, ఇదియే చైతన్యము అతనే పురుషుడు. కనుక లోపల చైతన్యము, బయట జడము. ఈ దేహము, ఈ చైతన్యము రెండింటియొక్క ఏకత్వమే అర్ధనారీశ్వరం. అర్ధనారీశ్వరుడనగా ఈశ్వరునికి మాత్రమే అర్ధశరీరము ఉందని కాదు. ప్రతి వ్యక్తికి కూడను అర్ధశరీరమే. దేహము ప్రకృతి. ప్రాణము ఈశ్వరుడు. కనుక రెండింటియొక్క ఏకత్వము చేతనే మానవత్వముగా రూపొందుచున్నది. కనుకనే మానవత్వమనగా కేవలం ఏక స్వరూపాన్ని పొందినటువంటిది కాదు. ఈ జగన్నాటక రంగమునందు అందరు వేషములు ధరిస్తున్నారు. అందులో భగవంతుడు కూడా వేషము ధరిస్తుంటాడు. కాని అందరు కూడా వేషధారులే. World is like a stage, all are actors, God is the only director. అతనియొక్క ఆజ్ఞ ప్రకారమే ఈ అందరికి వేషములు ఆ విధంగా ఆడుతుంటాయి. మనము వేషము ధరించినంత మాత్రమున మగ, ఆడ అని చెప్పడానికి విభజించడానికి వీలులేదు. మహిళా కాలేజీ ఉంది, ఆ కాలేజీ anniversary day లో డ్రామా వేస్తారు. ఆ డ్రామాలో రాజు, రాణి, చెలికత్తె, జవాను, మంత్రి, కాపలాదారు, సిపాయిలు యిలా రకరకములుగా వేషములు వేస్తారు. వీరందరు స్త్రీలే. రాజు వేషము ధరించారు, సిపాయి మాదిరి ఒక ఖడ్గం ధరించారు. ఈ జగత్తంతా కూడను ఒక నాటకరంగమే. ఇందులో అందరు వేషములు వేశారు. అందరియందు కూడను ఆత్మశక్తి ఒక్కటిగా ఉంది. కనుకనే ఉద్యోగం పురుష లక్షణం అని మీరు విర్రవీగడానికి

వీలు కాదు. కాని ఇప్పుడు ఆడవాళ్ళు కూడా ఉద్యోగములు ఎక్కువమంది చేస్తున్నారు. ఉద్యోగం లేనటువంటి పురుషులెందరో ఉంటున్నారు. కాబట్టి ఉద్యోగం పురుష లక్షణం కాదు. ప్రేమే పురుష లక్షణం, ధర్మమే పురుష లక్షణం, సత్యం పురుష లక్షణం. కనుకనే Truth is GOD, Love is GOD, Live in LOVE. ఇదే మనము చేయవలసినటువంటి పని. కనుకనే ఈనాడు భగవంతునియొక్క తత్వము పూర్ణస్వరూపమనేటువంటి సత్యాన్ని మనం గుర్తించాలి. ఒక్క వ్యక్తియందున్నది మరొక వ్యక్తియందు లేదని చెప్పి నిర్ణయించడానికి వీలుకాదు. సర్వత్రా ఉండినటువంటిది భగవంతుడే. మన కంటికి కనిపించడం లేదు కాని, ఆ జ్ఞాన నేత్రమునే తెరచినపుడు సర్వులకు గోచరమగుతాడు. గాలి ఎక్కడ ఉంది? కంటికి కనిపించదు, చేతికి చిక్కదు. కాని గాలి లేకపోతే మనం జీవించలేము. మన చుట్టూ ఉన్నది గాలి. కేవలము కనిపించక పోయినంత మాత్రమున గాలి లేదని విమర్శించడానికి వీలు కాదు. ఉందక్కడ, అదే విధముగనే దైవము కూడను సర్వ స్వరూపుడై ఉన్నాడు.

**దేహానందం తాత్కాలికం-ఆత్మానందం శాశ్వతం**

ఒక చిన్న ఫేను ఉన్నది. ఒక విసనకఱ్ఱ అంటారు. కాని మనము చాలా వేడిలో ఉన్నాము. విసనకఱ్ఱతో విసురుకున్నప్పుడు మనకు కొంత చల్లదనము కలుగుతుంది, చల్లదనం వస్తుంది. కాని విసరక పోయినంత మాత్రమున చల్లదనం లేదా? లేక ఈ చల్లదనం ఆ విసనరకఱ్ఱనుండి వచ్చినదా? ఏది సర్వత్రా ఉంటున్నాది. అదే విసనకఱ్ఱ మనవైపుకు ఊపుకోకుండా ఇతరులవైపుకు విసిరితే వారికి పోతుంది ఆ చల్లదనం. కాబట్టి నీ బుద్ధియే విసనకఱ్ఱ. ఈ బుద్ధిని ఆత్మవైపుకు త్రిప్పి విసిరితే ఆత్మానందము కలుగుతుంది. దేహమువైపునుంచి త్రిప్పితే దేహానికి ఆనందము కలుగుతుంది. దేహానందము తాత్కాలికమైనటువంటిది, క్షణికమైనటువంటిది. ఈ దేహముతో వచ్చేటువంటి సుఖము ఏమీ లేదు. ఇది

**మలినపు కొంప రోగముల మ్రగ్గెడు సేవకగంప జాతసం**
**చలనముపొందు దుంప భవసాగరమీదగలేని కంప అం**
**బుంబులపొది లెమ్ము చూడ మన మెప్పుదలంపగ దేహమింక ని**

sri sathyasaivachanamrutam

**శ్చలమని నమ్మబోకు మనసా! హరి పాదములాశ్రయింపవే.**

ఆ దైవత్వాన్ని మనము పొందితే సర్వమూ మనకు లభ్యమౌతుంది. మానవునికి లభ్యము కానటువంటిది లోకంలో ఏ ఒక్కటి లేదు. దేనినైనా మనము సాధించ వచ్చును. కాని హృదయమునందు భగవత్ భావములనేటువంటిది స్థిరముగా పెట్టుకోవాలి. అప్పుడే మనకు తగిన ఆనందము కూడా దక్కుతుంది. ఈ ఆనందమే సత్యము. ఈ సత్యానందమే జ్ఞానము.

**(తేదీ 29-04-1998న కొడైకెనాల్‌లో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam